క్లుప్తంగా

నేడు క్రీడా పోటీలు

సీతంపేట: స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడలు బాలురకు మాత్రమే మంగళవారం నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు.

రక్తదాన శిబిరం రేపు

సీతంపేట: మండల కేంద్రంలోని వైటీసీ వద్ద బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కేంద్ర ప్రభుత్వం, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మేము సైతం రక్తదాన శిబిరంలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు



బిల్లుమడ కాలనీ గణపతి మండపంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని బిల్లుమడ కాలనీ, బత్తిలి కాలనీ, ఘనసర, కీసర, కోమలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సోమవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లో స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. నేరడి–బి లో యువత నృత్యాల నడుమ వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో సోమవారం డిమాండ్ చేశారు. పీవో, ఏవో, మేనేజర్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా పోస్టుల్లో అధికారులు లేకపోవడంతో గిరిజన సమస్యలు చాలావరకు పరిష్కారం కావడం లేదని, దీంతో ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఆర్థిక సాయం..



సంజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు

భామిని: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లోపింటి సంజీవ్ (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రూ. పది వేలు సమీకరించి బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

కర్షకులపై కనికరం చూపని కూటమి

- ఉచిత పంటల బీమాపై నీలినీడలు
- ఇంతవరకూ బీమా విధానం ప్రకటించని సర్కారు
- ఇటీవల కురిసిన భారీవర్షాలతో నీట మునిగిన పంట పొలాలు



పొలం పనుల్లో నిమగ్నమైన రైతు

పాలకొండ రూరల్: సాగులో రైతుకు ధీమానిచ్చే పంటల బీమా పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోంది. గత నెల ఆగస్టుతో ప్రీమియం చెల్లింపునకు గడువు ముగిసింది. ప్రస్తుత సెప్టెంబర్‌లో రెండు వారాలు గడచిపోయావి. అయినా పాలసీ విధివిధానాలు ప్రకటించలేదు. ప్రస్తుత ఖరీఫ్ సాగు ఆరంభం నుంచి ప్రకృతి విపత్తులు, భారీ వర్షాలకు పంటకు నష్టం వాటిల్లినా.. ప్రభుత్వం ఇంకా మేల్కొనకపోవడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. సాగు కాలంలో విపత్తులతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం ఎంతో దోహదపడుతుంది. బీమా కంపెనీ లెక్కించిన పంట విలువలో రైతులు ఐదు శాతం వాటా చెల్లించాలి. గతంలోనూ టీడీపీ హయాంలో పసల్ బీమా యోజన ద్వారా ప్రీమియంలో 3 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తే మిగిలిన 2 శాతం రైతులు చెల్లించుకునే వారు. రైతులు వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే సమయంలో పంటకు బీమా చేయించేవి. మిగిలిన రైతులకు ప్రీమియం గడువుపై సరైన సమాచారం లేకపోవడం, పంట రుణాల విడుదలలో జాప్యం, తదితర కారణాలతో చాలా మంది ప్రీమియం చెల్లించకపోవడం వల్ల విపత్తులు ఏర్పడినప్పుడు పరిహారం అందక నష్ట పోవాల్సి వచ్చేది. దీనికి తోడు ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) కూడా ఆరు నెలలకో, ఏడాదికో ఇవ్వడం వలన పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందిపడాల్సి వచ్చేది. ప్రస్తుతం చాలా మంది రైతులు పంటలకు బీమా చేయించుకున్నా, ఇంతవరకు విధివిధానాలు విడుదల చేయకపోవడం శోచనీయం.

జిల్లాలో 1.85 లక్షల ఎకరాల్లో వరి..

రైతు పక్షపాతిగా పేరుపొందిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో రైతుపై భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేశారు. ఎకరానికి రూ.29,000 బీమా కాగా రైతు వాటా రెండు శాతం రూ.580 చొప్పున ఎన్ని ఎకరాలు సాగులో ఉంటే అన్నింటికీ ప్రభుత్వమే చెల్లించేది. దీంతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1.85 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ఇతర వాణిజ్య, కూరగాయ, తదితర పంటలు మరో 80 వేల ఎకరాల్లో సాగవుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పలు మండలాల్లో వరి, అరటి, పత్తి, ఇతర కూరగాయ పంటలు కీలక దశలో నీట మునిగాయి. పలు రకాల పండ్ల తోటలు కూడా దెబ్బతిన్నాయి.

స్పష్టత కరువు..

పంటల బీమా పథకం అమలుపై కూటమి ప్రభుత్వం నేటికీ ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తోంది. రైతుల భాగస్వామ్యం లేకుండా పంటల బీమా ఏంటని ఇటీవల సీఎం చంద్రబాబు అన్నారు.

దీంతో గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకం అమలును ప్రశ్నార్థకం చేస్తోంది. మరోపక్క అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు ఏటా ఇస్తామన్న రూ.20 వేల సంగతీ తేలలేదు. క్రాప్ బీమా ప్రీమియం చెల్లింపునకు ఆగస్టు 31తో గడువు ముగిసింది. గడువు పెంచుతారని రైతులు, వ్యవసాయాధికారులు భావిస్తున్నా యంత్రాంగం నుంచి సమాధానం లేదు. రైతులు ప్రీమియం చెల్లించాలని గాని, గత ప్రభుత్వం మాదిరి ఉచిత పంటల బీమా పథకం అమలు చేస్తామని గాని, గడువు పెంచుతామని గాని కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడం రైతులను కలవరపరుస్తోంది.

పెట్టుబడి సాయం అందలేదు..



గత ప్రభుత్వం సీజన్‌కు ముందే అన్ని రకాలుగా రైతును ప్రోత్సహించేది. కొత్త ప్రభుత్వం ఇంతవరకు పెట్టుబడి సాయం అందించలేదు. ఉచిత పంటల బీమా అమలుపై విధివిధానాలు ప్రకటించ లేదు. అధికారుల వద్ద కూడా ఎటువంటి సమాచారం లేదు. తాజా వర్షాలతో పంటలు నీట మునిగాయి. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

వి.కొండలరావు,
రైతు, బుక్కూరు, పాలకొండ మండలం

గీతా సారాంశం తెలుసుకో..



ప్రచారంలో ఇందూ విజ్ఞాన వేదిక ప్రతినిధులు

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ గీతా సారాంశం తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఇందిరానగర్ కాలనీలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణుడి గీతా సారాంశంతో కూడిన పుస్తకాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో ఇందూ విజ్ఞాన వేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు గోపాలకృష్ణ, రామకృష్ణ, వెంకటరావు, దుర్గారావు, లక్ష్మి, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.3 లక్షల విరాళం



ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి నగదు అందజేస్తున్న కూటమి నాయకులు

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొమరాడ మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు రూ.3 లక్షల విరాళం ప్రకటించారు. అనంతరం నగదును గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని సోమవారం కలిసి అందజేశారు. ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కొమరాడ మండల టీడీపీ, జనసేన నాయకులు శేఖర్‌పాత్రుడు, వెంకటనాయుడు, గౌరీశంకర్, అనంత్, ఉపేంద్ర, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పాలకొండ – పార్వతీపురం రహదారి



రాయుడు కోనేటి మలుపు వద్ద వ్యాపించిన దుమ్ము

పాలకొండ రూరల్: పట్టణంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా పాలకొండ – పార్వతీపురం రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్డు ప్రారంభంలో కార్గిల్ కూడలి పూర్తిగార చిత్తడిగా మారింది. అక్కడకు సమీపంలో రాయుడు కోనేటి మలుపు వద్ద రహదారిపై ఏర్పడిన గోతుల్లో దుమ్ము లేస్తుండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు చెబుతున్నారు. రహదారి మొత్తం గోతులతో నిండిపోవడంతో రాకపోకలు కష్టంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

భామిని: మండలంలోని బత్తిలి కోటదుర్గ (పోలీస్ దుర్గ) సన్నిధిలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు బత్తిలి ఎస్సై డి. అనిల్‌కుమార్‌కు నిర్వాహకులు సోమవారం ఆహ్వానం పలికారు. ఈ మేరకు తాంబూలం అందజేశారు. ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, గురుస్వామి భవానీ రామశంకర్, తదితరులున్నారు.

ఏచూరి మరణం తీరని లోటు..



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల నాయకుడు దావాల రమణరావు అన్నారు. మండలంలోని సిరికొండలో సోమవారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం ఏచూరి పని చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాద రాము, దూసి దుర్గారావు, ఎస్. గంగయ్య, పాల్గొన్నారు.


మాపై కనికరం లేదా..!



ఏరియా ఆస్పత్రి వద్ద నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

పాలకొండ రూరల్: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన తమపై కనికరం లేదా అని కాంట్రాక్ట్ నర్సులు అన్నారు. కష్టకాలంలో విధులు నిర్వహించిన తమను పక్కనబెట్టి ఇటీవల విధుల్లోకి వచ్చిన ఏఎన్ఎంలు, జీఎన్ఎంలను రెగ్యులర్ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద కాంట్రాక్ట్ నర్సులు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తాము అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ చేయాలని కోరారు.

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు



భామిని: మండలంలోని బురుజోల మెట్టను అక్రమార్కులు రాత్రింబవళ్లు దొలిచేస్తూ ట్రాక్టర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. సోమవారం రాత్రి వరకు ట్రాక్టర్లతో భారీగా గ్రావెల్‌ను తరలించుకుపోయారు. వరుస సెలవు దినాలు కావడంతో అధికారులు కూడా చూసీచూడనట్లు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వంశధార నదికి రోడ్లు వేయడానికి,రియల్ ఎస్టేట్ స్థలాలు చదును చేయడానికి అనువుగా రెండు రోజుల నుంచి గ్రావెల్‌ను యథేచ్ఛగా తరలించడంతో ఆ రోడ్డుపై ప్రయాణానికి వాహనచోదకులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా



సీఐ హరికి మొక్క అందజేసి, శుభాకాంక్షలు తెలియజేస్తున్న సర్పంచ్‌లు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో శాంతిభద్రతలకు కృషి చేస్తానని సీఐ బి.హరి అన్నారు. మండల పరిధిలోని ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొత్తాడ శంకరరావు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే ఆయన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా గ్రామపెద్దలే చూసుకోవాలని, ఏవైనా చిన్నచిన్న తగాదాలు ఉంటే తమ వద్దకు రాకుండా గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్‌లో సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా పాటించాల్సి జాగ్రత్తలపై పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయని, స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చే అనవసర మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. మన ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దన్నారు. బ్యాంకు ఖాతాదారులు, స్మార్ట్‌ఫోన్‌లు ఉన్న వారంతా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మాయగాళ్ల బారినపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్, అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరికి ఐటీడీఏ తరలించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఐటీడీఏని మండలంలోని భద్రగిరి ఏజెన్సీ ప్రాంతానికి తరలించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వైటీసీ కార్యాలయంలో భద్రగిరిలో ఐటీడీఏ సాధనకై సదస్సు పేరిట ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఆదివాసీ ప్రాంతంలోనే ఉండాలన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఐటీడీఏను భద్రగిరికి మార్చాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీటీసీ మండంగి రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్, ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన



బ్రహ్మాస్త్రం తయారీని వివరిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గుణద గ్రామంలో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ ఎం.టి నిర్మలాదేవి, ఎల్‌వన్ ఢిల్లేశ్వరరావు, ఎల్‌టు పరశురాంలు ప్రయోగపూర్వకంగా బ్రహ్మాస్త్రం తయారు చేసి, దాని వినియోగం, ప్రయోజనాలను వివరించారు. సహజ సిద్ధంగా లభించే వనరులతో తయారు చేసుకునే ఈ బ్రహ్మాస్త్రం ద్రావణాన్ని వరి, పత్తి, కూరగాయల పంటలపై పిచికారీ చేస్తే కాండంతొలుచు పురుగుతో పాటు వివిధ తెగుళ్ల, చీడపీడలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీహరి, శైలజ, వెంకటేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణరావు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణరావు

సీతంపేట: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావల రమణరావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ బడ్జెట్ అమలు చేయాలని కోరారు. పథకం నిర్వహణలో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రొయ్య బారీ, ఉషా పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు, గ్రామపెద్దలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని శృంగారపు వీధికి చెందిన ఎస్.కొండలరావు తీవ్ర అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే ఆర్‌టీసీ కాంప్లెక్స్ కాలనీకి చెందిన మేస్త్రీ ప్రకాష్ ఇటీవల మృతి చెందాడు. సదరు వ్యక్తులిద్దరూ నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో దాతలెవరైనా ఆర్థికసాయం చేయాలని మండల కేంద్రానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్, గ్రామదేవత వాట్సాప్ గ్రూపుల్లో సర్పంచ్ బి.గౌరీశంకరరావు మెసేజ్ పెట్టారు. ఈ మేరకు సమకూరిన రూ.46 వేల నగదులో రూ.31 వేలను కొండలరావు కుటుంబానికి, మరో రూ.15 వేలను ప్రకాష్ కుటుంబానికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వర్తక, వైశ్య, కాపు సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించగా, ప్రవక్త అనుసరించిన జీవనశైలిని మతపెద్దలు తెలిపి, ఆయన బాటలో నడవాలని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని తెలిపారు. శివ్వన్నపేటలోని మసీదు నుంచి కురుపాం వరకు ప్రధాన రోడ్లలో ర్యాలీ చేపట్టి, మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరించాలని పిలుపునిచ్చారు.

రూ.40 వేలకు గణపతి లడ్డూ వేలం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామ తోటపల్లి కాలనీలో గణపతి లడ్డూ వేలం పాట ఆదివారం రాత్రి నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన మజ్జి ప్రసాద్ రూ.40 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే గణనాథునికి అలంకరణగా వాడిన కరెన్సీ నోట్లను అదే గ్రామానికి చెందిన బెహరా లక్ష్మీనారాయణ అనే వ్యక్తి రూ.27 వేలకు దక్కించుకున్నారు.

అనంతరం వారిని సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, ఎంపీటీసీ గుడారి విద్యారాణి, రంజిత్‌కుమార్ నాయక్, టీఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐ.రామకృష్ణ, మహిళా సంఘం అధ్యక్షురాలు కుమ్మరి నేలమ్మ తదితరులు జ్ఞాపికలతో సత్కరించారు. సోమవారం సాయంత్రం గణేశుని నిమజ్జనం అనంతరం లడ్డూ, కరెన్సీ నోట్లను వారికి అందజేశారు. మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

● గణేష్ మహరాజ్‌కీ జై..

పాలకొండ రూరల్: జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై నినాదంతో పాలకొండ పట్టణం మార్మోగింది. నాలుగు దశాబ్దాలుగా స్థానిక యాలం కూడలిలో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా అట్టహాసంగా ఉత్సవాలు నిర్వహించి, సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడు ముఖ్య అతిథిగా హాజరై గణపతి సేవలో గడిపారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన బళ్ల వేషధారణలు, డీజే నృత్యాలు, శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నాగావళి నదీ తీరంలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి పల్లా కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.



నవదుర్గ కళాకారుల నృత్యం



ఊరేగిస్తున్న భారీ వినాయక విగ్రహం



నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన బళ్ల వేషాలు



ఊరేగింపులో సరస్వతీదేవి విగ్రహం